క్లుప్తంగా

ఉక్కు పరిశ్రమపై బీజేపీ మోసం



న్యూశాయంపేట: బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై తెలంగాణను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు ఆరోపించారు. హనుమకొండ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర సమితి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుంటి సాకులు చెప్పకుండా ఏపీ పునర్‌విభజన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ సాధించేవరకు ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు సీహెచ్.రాజారెడ్డి, విజయసారథి, కర్రె భిక్షపతి, ఎం.రవి, రాజ్‌కుమార్, మల్లికార్జున్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు పి.రమేశ్, షేక్‌బాషుమియా, ఆదిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తి అరెస్ట్



కాజీపేట: కాజీపేట ప్రధాన రహదారిపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని శనివారం తనిఖీ చేయగా 900 గ్రాముల శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో తనిఖీలు చేస్తుండగా చేతిలో ప్లాస్టిక్ కవర్‌తో కనిపించిన తోట కృష్ణ మోహన్‌ను ఎస్సై శివకృష్ణకు సోదా చేశారు. సంచిలో గంజాయి బయటపడటంతో పంచుల సమక్షంలో విచారణ చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మచిలీపట్నం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా వెల్లడైంది. ఈమేరకు ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యారణ్యపురి: ప్రభుత్వ సంక్షేమశాఖ హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్ సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారదకు శనివారం వినతిపత్రం అందజేశారు. మంద నరేష్, బొట్ల మనోహర్, మాసాని ప్రదీప్, దుర్గం రవి, రాకేష్, రాహుల్ పాల్గొన్నారు.

గర్భిణులకు డయాబెటిస్ పరీక్షలు



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు హసన్‌పర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ అజిత్‌కుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కృపాకర్, సభ్యులు కుమారస్వామి, అంగన్‌వాడీ టీచర్ బి.రజనీ, తదితరులు పాల్గొన్నారు.

తల్లి మరణంతో పెళ్లి వాయిదా

వరంగల్: పెళ్లికి ఒక రోజు ముందే కన్నతల్లి మృతి చెందిడంతో పెళ్లి వాయిదా పడిన ఘటన వరంగల్ కాశిబుగ్గలో శనివారం చోటు చేసుకుంది. వరంగల్ కాశిబుగ్గకు చెందిన గుర్రపు రజనీ – సమ్మయ్య దంపతుల కుమారుడు సుకీర్త్, గుంటూరుకు చెందిన దేవి నాగరమ్మలకు వివాహం ఆదివారం గుంటూరులో జరగనుంది. ఈక్రమంలో శనివారం పెండ్లి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో పెళ్లి కుమారుడి తల్లి రజనీకి గుండెపోటు వచ్చి ఇంట్లో పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందింది.

నేడు అనంతమల్లయ్య సంస్మరణ సభ

కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆలయ వ్యవస్థాపకుడు అయిన వోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి సంస్మరణ సభను ఆదివారం నిర్వహించనున్నట్లు వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధాంతి శివక్యం పొంది ఏడాది గడిచిన నేపథ్యంలో సంస్మరణ సభను భక్తులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ పరిపాలకుడు సాయికృష్ణ శర్మ, ఆలయ ఇన్‌చార్జ్ గంగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న సభను భక్తులు, పట్టణ ప్రముఖులు విజయవంతం చేయాలని రాధాకృష్ణ శర్మ కోరారు.

చిరు వ్యాపారుల జీవన పోరాటం

- తెల్లవారుజాము నుంచి పొద్దుపోయే వరకు..
- కుటుంబ జీవనం కోసం తలమునకలు
- అడ్డాలు, షెల్టర్లు లేక రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు
- అధికారుల ఒత్తిళ్లతో తప్పని తిప్పలు




వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై చిరు వ్యాపారుల పండ్లు, కూరగాయల దుకాణాలు

ఖిలా వరంగల్: వరంగల్ మహానగరంలో చిరు వ్యాపారాలను నమ్ముకుని వేలాది మంది చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. తెల్లవారుజాము నుంచి పొద్దుపోయే వరకు ఏదోఒక వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారికి సరైన అడ్డాలు లేక రోడ్ల పక్కన వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. ఈక్రమంలో పోలీసులు, వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. వానకు, ఎండకు, చలిని తట్టుకుని రెక్కలు ముక్కలు చేసుకుంటే మిగిలేది అంతంత మాత్రమేనని చిరువ్యాపారులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కుటుంబ పోషణకు పొద్దస్తమానం కష్టం

రోడ్ల పక్కన, వీధుల్లో, తోపుడు బండ్లలో కూరగాయలు, పండ్లు, శీతల పానీయాలు, అల్పాహారం, గృహోకరణ వస్తువులు, పూలను చిరు వ్యాపారులు విక్రయిస్తూ బతుకీడుస్తున్నారు. వరంగల్ గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేకమంది పేదలు చిరు వ్యాపారం కోసం ఎక్కువగా నగరానికి వస్తున్నారు. ఏదోఒక పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిలో కొంతమంది పండ్లు, కూరగాయాలు, ఇతర చిరు వ్యాపారాలు చేస్తుంటారు. వారంతా సంఘటిత కార్మికులే అయినా కార్మిక చట్టంలో మాత్రం వారి బతుకుకు భద్రత లేదు. రోజంతా కష్టపడినా కూలి గిట్టుబాటు కావడం లేదంటూ చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయాలు, పండ్ల వ్యాపారులు ఉదయం 7గంటలలోపు నగరానికి వచ్చి విక్రయిస్తున్నారు. సాయంత్రం వ్యాపారాలను ముగించుకుని రాత్రి 9గంటల లోపు ఇంటికి చేరుకుంటారు. అంత కష్టపడినా రూ.500 కూడా రావడం లేదని వారు వాపోతున్నారు. రోడ్లపై వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో ట్రాఫిక్ పోలీసులు, అధికారులు తమపై దాడులు చేస్తున్నారని చెబుతున్నారు. వారి బెదిరింపులు, మామూళ్ల బెడద ఉన్నా రాజీపడుతూ వీధి వ్యాపారంతో జీవనం సాగిస్తూ బతుకుబండిని లాగుతున్నామని వారు అంటున్నారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలి

వీధి వ్యాపారులు ఎండనకా వాననకా చలిలోనూ వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కార్మిక చట్టాలు ఎన్ని ఉన్నా చిరువ్యాపారుల జీవన పరిస్థితిపై పాలకులకు పట్టింపు లేదు. ఆదుకోవాలని ప్రభుత్వాలకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చిరు వ్యాపారులకు ప్రత్యేక గుర్తింపుతోపాటు ఆర్థిక సాయం అందజేయాలి.

- గజ్జెల లింగమూర్తి, చిరువ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పండ్ల బండే మాకు ఆధారం



మా కుటుంబంలో ఐదుగురు సభ్యులం ఉన్నాం. అందరికి ఈ బండే ఆధారం. ఉదయం 7గంటల నుంచి రాత్రి 9గంటల లోపు రోజుకు ఖర్చులు తీసివేస్తే సుమారు రూ.500 వరకు సంపాదిస్తున్నాను. ఎండ, వాన, చలికి తట్టుకుని కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్నాను. మాలాంటి వారిని అధికారులు, పాలకులు ఆదుకోవాలి.

- శ్రీకాంత్, చిరువ్యాపారి, శివనగర్

చిరు వ్యాపారుల హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న ఇస్మాయిల్

కాజీపేట: చిరు వ్యాపారుల హక్కులను పాలకులు కాపాడాలని, చిరు వ్యాపారుల రక్షణ చట్టం –2014ను అమలు చేయాలని బీఆర్ఎస్ అనుబంధ సంఘం బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రహదారులను నమ్ముకుని జీవిస్తున్న చిరు వ్యాపారులపై దాడులు చేసి అడ్డాలను తొలగించడం బాధాకరమని వాపోయారు. కాజీపేట పట్టణంలో అకారణంగా తొలగించిన చిరు వ్యాపారుల అడ్డాలను తిరిగి ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఇంజాల మల్లేశం, నాయిని రవి, రఘు, అరుణ్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ మెట్టురామన్న కాలనీలో సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో సమస్యలు ఉంటే 80961 07107 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ మునిగాల సరోజన, కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకుడు గుర్రం జ్యోతిఅమర్‌నాథ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బిల్ల రవీందర్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, నాగరాజు, శ్రీనివాస్, దువ్వ విజయ్, కుర్ల మోహన్, నీలం రజినీ, వేణుయాదవ్, పల్లపు అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

మడికొండ: మెట్టుగుట్టపై అయ్యప్ప ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని మడికొండ శ్రీఅయ్యప్ప సేవాసమితి సభ్యులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని శనివారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి గౌరవ అధ్యక్షుడు ఓర్సు యాకయ్య, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, పల్లపు అర్జున్, వస్కుల శంకర్, పల్లపు నర్సింగ్, కుర్ల మోహన్, బైరి కొంరయ్య, బుర్ర రాజన్‌బాబు, దువ్వ నవీన్, విజయ్, ఆలకుంట్ల దుర్గయ్య, దండిగం సతీష్, మాలధారులు పాల్గొన్నారు.

ఘనంగా కేవీ వ్యవస్థాపక దినోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాజీపేట అర్బన్: కేంద్రీయ విద్యాలయ 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కాజీపేట మండలం కడిపికొండలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఇంగ్లిష్ టీచర్ ప్రకాష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత స్థానానికి ఎదిగేందుకు కేవీ వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివితే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వెస్టర్న్, గుజరాతీ నృత్యాలు, మైమ్, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏక్ భారత్.. శ్రేష్ట భారత్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు స్మిత, మీర్జా, భిక్షపతి, వెంకన్న, ఉదయ్, శ్రీనివాస్, లలిత, విద్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సఖి సెంటర్ సేవలపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సఖి నిర్వాహకులు

వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని బాపూజీనగర్ మహిళా సంఘాల సభ్యులకు వరంగల్ సఖి సెంటర్ నిర్వాహకులు శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు అందించే సేవలు వివరిస్తూ, మహిళల, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని వివరించారు. ఈ సెంటర్లలో బాధిత మహిళలకు కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు మహిళా హెల్ప్‌లైన్ 181 నంబర్‌కు కాల్ చేస్తే తక్షణ రక్షణ కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికల హక్కులు, చట్టాలు, గృహహింస చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం వంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆర్‌పీ సౌజన్య, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కార్మికులకు స్వెటర్ల పంపిణీ



వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు స్వెటర్లను స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ శనివారం పంపిణీ చేశారు. బల్దియా ఆధ్వర్యంలో గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు కేంద్రం వత్తాసు



సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

- ఏఐసీటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రతాప్

వరంగల్ చౌరస్తా: కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతోందని ఏఐసీటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు జగదీశ్వర్ విమర్శించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఏఐసీటీయూ) వరంగల్ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం రాయినేని ఐలయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక పోరాటాలు త్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాసి 4 లేబర్ కోడ్‌లుగా కేంద్రం మార్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా నగర నాయకులు ఐతమ్ నగేష్, ఎగ్గేని మల్లికార్జున్, నరసయ్య, నలివెల రవి, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

వరంగల్: బంధువుల పెళ్లికి వచ్చిన తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విజయవాడకు చెందిన నొదగల సిద్ధార్ అనే వ్యక్తి ఇంతేజార్‌గంజ్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వరంగల్ గిర్మాజీపేటలోని బంధువుల ఇంట్లో జరుగుతున్న పెళ్లికి వచ్చిన తాము షాపింగ్ చేసి వచ్చి ఇంటివద్ద కారు పార్కింగ్ చేస్తున్న సమయంలో లక్ష్మీపురం, గోవిందరాజు గుట్టకు చెందిన సన్నీ, అక్షయ్, బాచి, ఉదీష్, లికిత్ సన్నీ, అభి, సిక్కు అనే వ్యక్తులు అకారంణంగా గ్రానైట్ రాయి, కర్రలతో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలపై చలో అసెంబ్లీ

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 17న చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో చలో అసెంబ్లీ వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖమంత్రిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు, మెస్, కాస్మోటిక్ చార్జీల బకాయిలను విడుదల చేయాలని సూచించారు. కార్యక్రమంలో కావ్య, అనూష, సాధన, పృథ్వీరాజ్, పవన్‌కల్యాణ్, దుర్గాప్రసాద్, అరవింద్, కృష్ణ, నరేష్, రాజ్‌కుమార్, సాయినంద్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మడికొండ: 46వ డివిజన్ సరయు వాటర్ ప్లాంట్ లైన్‌లో పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోందని సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు పైపులైన్ లీకేజీకి మున్సిపల్ సిబ్బంది శనివారం మరమ్మతులు చేశారు. దాంతో స్థానిక కాలనీవాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనాలు



యాకుబ్‌పురలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

వరంగల్ చౌరస్తా: తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల యాకుబ్‌పురలో విద్యార్థులతో కలిసి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం సహపంక్తి భోజనం చేశారు. 40 శాతం డైట్ చార్జీలు పెంచినందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఏఈ మధుసూదన్ ప్రతినిధులు మీసాల ప్రకాశ్, కిషోర్, కృష్ణ, జారతి రమేష్, మధు, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు వెంకటేష్, సతీష్‌ను అధికారులు, నాయకులు సన్మానించారు.



మడికొండ: గురుకులంలో అధికారులు

సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో..

మడికొండ: మడికొండలోని సాంఘిక సంక్షేమ బాలికలు గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థినుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి ఎం.మల్లయ్య, కాజీపేట రెవెన్యూ అధికారి భావుసింగ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, తదితరులు పాల్గొని భోజనశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొనసాగుతున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె



సంఘీభావం తెలుపుతున్న ఎస్‌టీయూ బాధ్యులు

విద్యారణ్యపురి: విద్యాశాఖలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతోంది. హనుమకొండ ఏకశిల పార్కు వద్ద కొనసాగుతున్న దీక్షలకు వివిధ సంఘాల బాధ్యులు శనివారం సంఘీభావం తెలిపారు. నిరసన దీక్షలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ.షఫీ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికన శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తౌటం భాస్కర్, జిల్లా అధ్యక్షుడు తుమ్మ తిరుపతి, ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేష్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, బాధ్యులు రవి, సుధాకర్‌రెడ్డి, సాంబయ్య, కె.రాంబాబు, వి.రాంబాబు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మధులిమాయి, బాధ్యులు పాల్గొన్నారు. అలాగే, సమగ్రశిక్ష ఉద్యోగులకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తిని వీరస్వామి, డాక్టర్ శ్రీనివాస్, ఉప్పుల సతీష్, పిన్నింటి బాలాజీరావు, బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సెల్ కోచైర్మన్ పులి సరోత్తంరెడ్డి సంఘీభావం తెలిపారు.

మినిమమ్ టైంస్కేల్ వర్తింపజేయాలి

సమగ్రశిక్ష ఉద్యోగులకు మినిమం స్కేల్‌ను వర్తింపజేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. హనుమకొండ ఏకశిల పార్కు వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు టీపీటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీపీయూఎస్ బాధ్యులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బాధ్యులు పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఏకశిల పార్కులో మహాధర్నా వాల్‌పోస్టర్లను సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తిని వీరస్వామి, ఉప్పుల సతీష్, వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పిన్నింటి బాలాజీరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కనీస హామీలు నెరవేర్చాల్సిన బాధ్యతను సర్కారుపై ఉందని గుర్తుచేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నాలుగు డీఏలను ఇంకా విడుదల చేయలేదన్నారు. జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ బిల్లులు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల పింఛన్, వేతనాలకు సంబంధించిన సప్లిమెంటరీ, ఏరియర్స్ బిల్లులు ఈ–కుబేర్ ద్వారా రావాల్సిన అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సెల్ రాష్ట్ర కోచైర్మన్ పులి సరోత్తమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఎస్పీ నిరవధిక నిరాహార దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నయీంనగర్: ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు డీఎస్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ పేద, మధ్యతరగతి ప్రజలకు ఐదు ప్రాథమిక అత్యవసరాలైన ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి ఇవ్వాలని కొంతకాలంగా డీఎస్పీ పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. ఈక్రమంలో వివిధ రూపాల్లో పోరాట కార్యక్రమాలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో బరిగెల బాబు, మైదం రవీందర్, రూప, యేసోబు, నరేష్, ప్రసాద్, ఎల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శక్తిని పొదుపుగా వాడుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

హసన్‌పర్తి: భవిష్యత్ తరాల దృష్ట్యా విద్యుత్ శక్తిని పొదుపుగా వాడుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు సూచించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో జాతీయ ఇంధన పొదుపు దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో జల శక్తి, థర్మల్ శక్తి పూర్తిగా తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం విద్యుత్ శక్తిని పొదుపుగా వాడుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు నాగరాజు, వెంకట్, వెంకటేశ్వర్లు, రాధాకుమారి, సబిహా, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ రెడ్డి (ACO) : 9177258410 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)